1st Year
Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 93 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 08 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 93 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Wednesday 08 April 2026 PAGES : 8 PRICE : 3/-

## యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 07)

పశ్చిమాసియా సంక్షోభంతో, దేశీయంగా ప్రభావితమైన రంగాలకు మద్దతు ఇవ్వడానికి, మూలధన వ్యయాల్ని పెంచడానికి ప్రభుత్వానికి తగినంత ద్రవ్యపరమైన వెసులుబాటు ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. యుద్ధం వల్ల తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ▶మిగతా 2లో

## దేశ శ్రేయస్సే వ్యక్తిగత పురోగతికి కీలకం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 07)

దేశం సుసంపన్నంగా, సురక్షితంగా ఉన్నప్పుడే వ్యక్తిగత పురోగతి సాధించగలమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) అధ్యక్షుడు మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. కేరళలోని కొచ్చిన్‌లో ఆరెస్సెస్‌కు సాంస్కృతిక అనుబంధ సంస్థ 'బాలగోకులం'లో రెండు రోజుల సదస్సును సోమవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ▶మిగతా 2లో

## ఇది భారత్ గర్వించదగిన క్షణం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 07)

కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ అణు రియాక్టర్ (గ్రాఖీదీ=) క్రిటికాలిటీని సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణమని, దేశ పౌర అణు ప్రస్థానానికి ఇదొక గొప్ప ప్రోత్సాహమని ఆయన అన్నారు. ఈ చరిత్రాత్మక విజయం సాధించిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, "భారత అణు కార్యక్రమం రెండో దశలో ఇది ఒక కీలక ముందడుగు. ఈ విజయంతో మన దేశంలో ఉన్న విస్తారమైన థోరియం నిల్వలను మూడో దశలో వినియోగించుకోవడానికి మరింత చేరువయ్యాం" అని వివరించారు. ఈ పరిణామం దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రతకు మార్గాన్ని బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ▶మిగతా 2లో

# రాష్ట్రంలో ప్రతి ఉద్యోగాన్ని పక్కాగా ట్రాక్ చేయాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 07)

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి ఉద్యోగాన్ని పక్కాగా ట్రాక్ చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటు చేసిన మంత్రుల ఉపసంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

రాష్ట్రానికి ఇప్పటివరకు వచ్చిన పరిశ్రమలు, వాటి ద్వారా కల్పించిన ఉద్యోగాలు, ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ పురోగతిపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు రాష్ట్ర యువతకు వివిధ రంగాల్లో 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకోవడానికి అనుసరిస్తున్న వ్యూహాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మేము వాగ్దానం చేశాం. ఆ లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి. నైపుణ్యం పోర్టల్ తరహాలోనే, ఆధార్ లేదా కేవైసీ అనుసంధానంతో ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేసేందుకు ఒక బలమైన వ్యవస్థను రూపొందించాలి" అని స్పష్టం చేశారు.




ప్రభుత్వ దృష్టిలో చిన్న పరిశ్రమలు, పెద్ద పెట్టుబడులు రెండూ సమానమేనని, ఉద్యోగాల కల్పనే తమకు అత్యంత ముఖ్యమని ఆయన తేల్చిచెప్పారు. పెట్టుబడుల గ్రౌండింగ్‌పై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీనిపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతుల ప్రక్రియను సింగపూర్, దుబాయ్ కంటే సులభతరం చేయాలని మంత్రి లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. "పరిశ్రమలకు అవసరమైన అన్ని శాఖల అనుమతులు, నిరభ్యంతర పత్రాలను (ఎన్వోసీ) మ్యాపింగ్ చేసి, వాటి పురోగతిని పర్యవేక్షించేందుకు ఒక ట్రాకింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను నిరంతరం ట్రాక్ చేస్తూ, అవి కార్యరూపం దాల్చేలా చూడాలి" అని ఆదేశించారు. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఈడీబీ)ను మరింత బలోపేతం చేయాలని, ప్రతి శాఖ ఈడీబీ ట్రాకర్‌ను పర్యవేక్షించేందుకు ఒక సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌ను నియమించాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కులు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి పవర్ బ్యాంకింగ్ వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, పరిశ్రమలు, ఐటీ, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమరావతి అజేయంగా వెలుగొందుతుంది

బాలకృష్ణ భావోద్వేగ సందేశం!



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 07)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమరావతిని ఏకైక రాజధానిగా ఆమోదించడం, కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఒక చారిత్రాత్మక క్షణమని బాలకృష్ణ పేర్కొన్నారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, మన రాష్ట్ర భవిష్యత్తుకు ప్రతీక అని ఆయన అన్నారు. అమరావతి రైతుల సహనం, త్యాగం, నిబద్ధత వల్లే ఈ రోజు ఈ చారిత్రాత్మక క్షణం సాధ్యమైందని, ఇది వారి విజయమని కొనియాడారు. అమరావతి కోసం ఎన్నో కష్ట నష్టాలు ఎదొర్కొని మొక్కవోని దీక్షతో స్ఫూర్తి దాయకమైన పోరాటం చేసిన అమరావతి ప్రాంత ఆడపడుచులకు, వారికి అన్నివిధాల సహకరించిన వారికి, మీడియా మిత్రులకు, ప్రతిఒక్కరికి తన ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కి చట్టపరమైన గుర్తింపు లభించడం చరిత్రలో సువర్ణక్షారాలతో లఖించదగిన ఘట్టమని అన్నారు. రాజధాని కల సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆయన హృదయపూర్వక ▶మిగతా 2లో

## మాలోనే ఒక గూఢచారి: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 07)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో ఒక గూఢచారి ఉన్నారని పేర్కొన్నారు. ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడేందుకు యూఎస్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ వివరాలను గుర్తుతెలియని వ్యక్తి (గూఢచారి) లీక్ చేశారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

యూఎస్ సైన్యం నిర్వహించిన ఆపరేషన్ గురించి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎఫ్-15ఈ విమానం కూలిన తర్వాత ఒక పైలట్‌ను అమెరికా బలగాలు రక్షించాయన్నారు. అయితే, రెండో పైలట్ కోసం బలగాలు ఇంకా గాలిస్తున్నాయని ఓ వార్తాసంస్థ రాసిన కథనంతో ఇరాన్ (×తీఘఅ)కు ఆ విషయం తెలిసిందన్నారు. దీంతో ఆపరేషన్ క్లిష్టతరమైందన్నారు. ఈ వార్త రాసిన జర్నలిస్టుకు ఆ సమాచారం ఎక్కడినుంచి వచ్చిందో వెల్లడించాలన్నారు. లేదంటే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. సమాచారం ఎవరిచ్చారో జర్నలిస్టు చెప్పకపోతే.. జైలుకి వెళ్లాల్సివస్తుందని బెదిరించారు. అయితే, ఆ జర్నలిస్టు పేరు గానీ.. ఆ వార్త సంస్థ పేరు గానీ ట్రంప్ బయటపెట్టలేదు. ▶మిగతా 2లో

## మా ఎజెండా పూర్తి కాలేదు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 07)

ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అనేవి రెండూ భాజపా ఇంకా పూర్తి చేయాల్సిన ఎజెండాలో ఉన్నాయని, వాటిపై సానుకూలంగా ముందడుగులు పడుతున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. భాజపా 47వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పార్టీ కార్యకర్తల్ని ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. తమ మిషన్ కొనసాగుతోందని, పెండింగులోని రెండు అంశాలపై చర్చిస్తూ.. చెప్పుకోదగ్గ పురోగతి సాధించామని చెప్పారు. "మహిళా రిజర్వేషన్ల కోసం తొలిసారిగా 1994లో భాజపాయే ప్రస్తావించింది. చట్టసభల్లో 33% సీట్లను మహిళలకు కేటాయించేందుకు ప్రస్తుత సర్కారు పూర్తిగా కట్టుబడి ఉంది. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచే దీన్ని అమలు చేయాలనుకుంటున్నాం. కాంగ్రెస్ హయాంలో భాజపా కార్యకర్తలు ఎమర్జెన్సీ సమయంలో, ఆ తర్వాత అనేక రకాల అణచివేతను ఎదుర్కొన్నారు. చాలామంది ప్రాణత్యాగం చేశారు. హింస ఒక రాజకీయ సంస్కృతిగా మారిన పశ్చిమబెంగాల్, కేరళల్లో ఇది ఇంకా ఎక్కువ" అని ప్రధాని తెలిపారు.



అస్సాంలోని బారేట ఎన్నికల సభలో కమలం గుర్తుతో ప్రధాని మోదీ

అస్సాంలోని దిబ్రూగఢ్ సభలో కరవాలంతో ప్రధాని మోదీ

### వసుధైక కుటుంబాన్ని విశ్వసిస్తాం

వసుధైక కుటుంబం అనేదాన్ని భాజపా విశ్వసిస్తుందని, యుద్ధ సమయంలోనూ అదే వర్తిస్తుందని ప్రధాని చెప్పారు. అన్ని దేశాలకు సమదూరం

## చొరబాటుదారులపై మాట్లాడతారే తప్ప తరిమేయరు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 07)



అస్సాంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రం నుంచి చొరబాటుదారులను భాజపా వెనక్కి పంపలేకపోయిందని ఆ పార్టీ, కేంద్రమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కచార్ జిల్లాలోని బోర్ఖోలాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "అస్సాంకు అమిత్ షా ఎప్పుడు వచ్చినా బంగ్లాదేశ్ చొరబాటుల దారులపైనే మాట్లాడతారు. అక్రమ వలసదారులను తరిమేయకపోగా ▶మిగతా 2లో

## 'మావిగన్' నుంచి డైవర్షన్ కోసమే ఏబీఎన్ రాధాకృష్ణ ఈ వ్యాఖ్యలు చేశారు: జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 07)

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నాయకుల భార్యలను ఉద్దేశించి రాధాకృష్ణ అత్యంత అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించారని, ఇది మహిళలను ఉద్దేశపూర్వకంగా అవమానించడమేనని జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు కేవలం విమర్శ కాదని, మహిళల ఆత్మగౌరవంపై చేసిన దాడిగా భావించాలని ఆయన అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు.



### జగన్ ట్వీట్ ఇదే...!

"రేపు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీ భార్యలను మీ భార్యలు కాదని చెబితే, మీరు దాన్ని నమ్మి, మీ సొంత భార్యలను అక్కచెల్లెళ్లుగా భావించి మరీ పెళ్లి సంబంధాలు చూసే స్థాయికి దిగజారిపోతారు. అంతగా ▶మిగతా 2లో

## మొదటిపేజీ తరువాయి

# యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం

ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు మరింత తగ్గించేందుకు వీలుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా మెరుగైన విధానాలు అనుసరించిన ఫలితం ఇప్పుడు కలిసొస్తోందని పేర్కొన్నారు. అధిక అప్పులు, భారీ ద్రవ్యలోటు కలిగిన అనేక దేశాలు ప్రస్తుత సంక్షోభ సమయంలో ఇబ్బంది పడుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ) కార్యక్రమంలో మంత్రి వివరించారు. దశాబ్ద కాలంగా ద్రవ్య క్రమశిక్షణ పాటించినందునే.. ముడిచమురు ధర 50% పెరిగినా, మన దేశంలో డీజిల్, పెట్రోల్ రిటెయిల్ ధరలు పెంచలేదని, కీలక పెట్రో ఉత్పత్తులకు, దేశీయ టారిఫ్ ప్రాంతంలో పని చేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్‌ఈజెడ్)కు నిర్దిష్ట మినహాయింపులు ఇచ్చినట్లు వివరించారు. మార్చి 26న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించడాన్నీ గుర్తు చేశారు. ఎగుమతులను నిరుత్సాహ పరచి, దేశీయంగా సరఫరాల్లో కొరత లేకుండా చూసేందుకు డీజిల్‌పై లీటరుకు రూ.21.50, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని విధించామన్నారు.

# దేశ శ్రేయస్సే వ్యక్తిగత పురోగతికి కీలకం

"దేశ శ్రేయస్సే వ్యక్తిగత పురోగతికి కీలకం. దేశం సుసంపన్నంగా ఉన్నప్పుడే కుటుంబాలు భద్రత పొందుతాయి. దేశాభివృద్ధి, భద్రత కోసం పనిచేసే వ్యక్తులు కూడా పురోగతి సాధిస్తారు. ఒంటరిగా అభివృద్ధి సాధించలేం. యువతలో వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టాలా? లేక దేశ నిర్మాణంలో భాగం కావాలా? అనే విషయంలో తరచూ సందేహం నెలకొంటుంది. వ్యక్తిగత భవిష్యత్తును నిర్మించుకోవడం, దేశాభివృద్ధిలో భాగం కావడం పరస్పర విరుద్ధం కాదు. సరైన మార్గాన్ని ఎంచుకోవడం ముఖ్యం" అని భాగవత్ సూచించారు.

# ఇది భారత్ గర్వించదగిన క్షణం

ఇంధన భద్రత దిశగా దేశం బలమైన అడుగులు వేస్తోందని చంద్రబాబు ప్రశంసించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించడంలో ఇటువంటి విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# అమరావతి అజేయంగా వెలుగొందుతుంది

కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీల ఎంపీలకు ధన్యవాదాలు చెప్పారు.

ఈ చట్టబద్ధమైన గుర్తింపుతో అమరావతిపై పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కలుగుతుందని... ఇకపై రాజధాని అజేయంగా, అజరామరంగా వెలుగొందుతుందని బాలకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మనందరం కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదామని, భావి తరాల కలలను నిజం చేద్దామని పిలుపునిచ్చారు. ఇక యావన్మంది ఆంధ్రులు సగర్వంగా... మా రాజధాని అమరావతి అని చాటుకోవచ్చని అన్నారు. "జై ఆంధ్రప్రదేశ్ -- జై అమరావతి" అంటూ తన సందేశంలో పేర్కొన్నారు.

# మాలోనే ఒక గూఢచారి

## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

లీక్‌కు కారణమైన వ్యక్తిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. వారు తమలోనే ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా దళాలు రెండో పైలట్ కోసం గాలిస్తున్నాయని వార్త ప్రచురితమైన తర్వాతే.. ఇరాన్ అప్రమత్తమైందన్నారు. ఆ పైలట్‌ను పట్టుకున్నవారికి భారీగా బహుమతి అందజేస్తామని ఆ దేశం బహిరంగ ప్రకటన జారీ చేసిందన్నారు. దీంతో తమ సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. గూఢచర్యానికి పాల్పడిన వ్యక్తిని మానసిక రోగిగా ట్రంప్ అభివర్ణించారు. అతడిని కనిపెట్టితీరాలని.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని ట్రంప్ పేర్కొన్నారు.

**ఆపరేషన్‌లో 155 విమానాలు..**

ఎఫ్-15ఈ పైలట్‌ను రక్షించేందుకు నిర్వహించిన ఆపరేషన్ వివరాలను ట్రంప్ వెల్లడించారు. 155 విమానాలు ఇందులో పాల్గొన్నాయన్నారు. వీటిల్లో నాలుగు బాంబర్లు, 64 ఫైటర్లు, 48 రీఫ్యూయలింగ్ విమానాలు, 13 రెస్క్యూ విమానాలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.

# మా ఎజెండా పూర్తి కాలేదు

పాటించే విధానం కొన్నాళ్లు అమలైనా ఇప్పుడు మాత్రం ప్రతి దేశంతో సన్నిహిత సంబంధాలు ఉండేలా ముందుకు వెళ్తున్నామని వివరించారు. పాతికేళ్లుగా మనుగడ సాగిస్తున్న ఎన్డీయే కూటమి ఒక్కటే ప్రజల కోసం, దేశ ప్రయోజనాల కోసం పాటుపడుతున్న సంకీర్ణమని చెప్పారు. తొలుత 'ఎక్స్' వేదికగానూ పార్టీ కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**పాకిస్థాన్‌కు వంతపాడుతోన్న కాంగ్రెస్**

భవానీపుర్: పొరుగుదేశంలో ఉన్న ఉగ్రవాద తండాలపై తాము 'ఆపరేషన్ సిందూర్' చేపడితే కాంగ్రెస్ మాత్రం ఇప్పటికీ పాకిస్థాన్‌కు వంతపాడటాన్ని కొనసాగిస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు. చొరబాటుదారులకు ఆ పార్టీ మద్దతు ఇస్తోందని, భూఆక్రమణల వ్యతిరేక చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. అస్సాంలోని బార్పేట జిల్లాలో సోమవారం ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే కాంగ్రెస్ పార్టీ అధిక ప్రాధాన్యమిచ్చిందని, అందువల్ల అస్సాం సంప్రదాయాలకు ఎంతో నష్టం వాటిల్లిందని చెప్పారు.

# చొరబాటుదారులపై మాట్లాడతారే తప్ప తరిమేయరు

వారిని పోషిస్తూనే వారి పేరుతో రాజకీయాలు చేస్తారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ.. 2005 నుంచి 2013 మధ్య 88,792 చొరబాటుదారులను దేశం నుంచి బహిష్కరించింది. మోదీ ప్రభుత్వం 2014 నుంచి 2019 మధ్య 2,566 మంది అక్రమ వలసదారులను మాత్రమే తొలగించింది. భాజపా, మోదీ, అమిత్ షాలు ఎన్నికలు హామీలు ఇస్తారు కానీ వాటిని అమలుచేయరు. ఎన్నికల్లో గెలుపొందాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను భాజపా దుర్వినియోగం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ముస్లింలు, దళితులు, ఆదివాసులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల నుంచి వారిని తొలగించి ఇతర వర్గాల ప్రజలను చేర్చారు. గ్రీన్ ఫీల్డ్ పేరుతో అస్సాంలో వేల ఎకరాలను బడా పారిశ్రామికవేత్తలకు మోదీ ప్రభుత్వం అప్పగించింది. అస్సాంలో భూమి, అడవులు, నీరు, ఇంధనం, ఖనిజ సంపద, గనులు దోపిడీకి గురవుతున్నాయి. అవినీతిలో కూరుకుపోయిన అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చింది. దేశాన్ని కాపాడాలంటే భాజపాకు ఓటు వేయకూడదు" అని ఖర్గే పిలుపునిచ్చారు.

# 'మావిగన్' నుంచి డైవర్షన్ కోసమే ఏబీఎన్ రాధాకృష్ణ ఈ వ్యాఖ్యలు చేశారు: జగన్

వెన్నెముకలేని నాయకులు వైసీపీలో ఉన్నారు!" అంటూ వేమూరి రాధాకృష్ణ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ లో వ్యాఖ్యానించారు. మహిళలను ఉద్దేశించి ఇలాంటి అసహ్యకరమైన, దిగజారిన భాషను ఉపయోగించడం, వారిని రాజకీయ చర్చల్లోకి లాగడం విమర్శ కానే కాదు. ఆ వ్యాఖ్యలు మహిళలను అవమాన పరచడమే కాకుండా, వారిని కించపరిచేలా చేసిన దాడిగానే భావించాలి. ఎలాంటి వివక్ష పూరిత జర్నలిజం చేస్తున్నారన్నదానిపై ఈ వ్యాఖ్యలు తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇవి మహిళలను అవమానించడానికే కాదు, ప్రజల్లో 'మావిగన్' ప్రతిపాదనపై జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం.

'మావిగన్ (పీ4×+ఖచీ)' ప్రతిపాదనను రాజకీయంగా ఎదుర్కోలేక, చంద్రబాబు, ఆయనకు అనుకూలంగా ఉన్న మీడియా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీంట్లో భాగంగా తప్పుడు ప్రచారాలు చేయడమే కాకుండా దూషణలకు కూడా దిగారు. మేము శాంతియుతంగా నిరసనలు చేపట్టి, రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాం. ఇంత తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, మా నాయకులు, కార్యకర్తలు ఎక్కడా హింసకు పాల్పడకుండా, శాంతియుతంగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అత్యంత సంయమనంతో వ్యవహరించారు. ఈ జుగుప్సాకర వ్యాఖ్యలను ఖండించకుండా, చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలకు మద్దతు ఇవ్వడం, మహిళల పట్ల వారికి ఉన్న అవమానకర ధోరణిని, ద్వేషభావాన్ని చూపిస్తోంది. రాధాకృష్ణపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. బాధ్యతారహిత, విషపూరిత వ్యాఖ్యలను సమర్థించిన నాయకుల వైఖరిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం" అంటూ జగన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

## మంటల్లో పూర్తిగా దగ్ధమైన కారు

## తప్పిన ప్రమాదం






**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, ఏప్రిల్ 7)**

సింగరాయకొండ జాతీయ రహదారి పై కారు డివైడర్ డీ కొని బోల్తా పడి మంటలో పూర్తిగా దగ్ధమైంది. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి తో నెల్లూరు నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ప్రాణనష్టం లేదు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపుచేశారు. హైవే పోలీసులు గాయపడిన క్షతగాత్రులను 108 సహాయంతో ఒంగోలు రిమ్స్ కి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# ఎన్నిక ఏదైనా తెలుగుదేశం జెండా ఎగరాలి

**ప్రతి బూత్ యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులదే బాధ్యత**

**ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం**

**రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమ మన లక్ష్యం**

**తెలుగుదేశం పార్టీ నే రాష్ట్ర పునర్ని నిర్మాణం**

**దేశం గర్వించేలా అమరావతి రాజధాని నిర్మాణం**

**ఆంధ్రప్రదేశ్ మార్గదర్శి సీఎం చంద్రబాబు**

**సీఎం చంద్రబాబు తోనే ఏపీ అద్భుత ప్రగతి**

**తెలుగుదేశానికి పార్టీ కార్యకర్తలు బలం బలగం**

**కార్యకర్తల సంక్షేమానికి కృషి చేసే ఏకైక పార్టీ టిడిపి**

**కార్యకర్తల అభ్యున్నతికి యువనేత లోకేష్ కృషి**

**తెలుగుదేశం పార్టీ శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే ఏలూరి**



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 7)**

ఎన్నిక ఏదైనా తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలంటే బూత్ స్థాయి వ్యవస్థ పటిష్టంగా ఉండాల్సిందేనని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రతి బూత్ యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాధ్యతగా పనిచేస్తే పార్టీ విజయం అనివార్యమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో చురుకుగా, నిబద్ధతతో పనిచేస్తే ఎలాంటి ఎన్నికలైనా పార్టీ విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ఎన్నిక ఏదైనా... తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలంటే బూత్ స్థాయి నుంచే కృషి ప్రారంభం కావాలి" అని అన్నారు.

**బూత్ స్థాయి వ్యవస్థతోనే శాశ్వత విజయం...**

"బూత్ మేనేజ్‌మెంట్‌నే పార్టీకి అసలైన బలం. ప్రతి బూత్‌లో ఓటర్ల పూర్తి వివరాలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమాచారం కార్యకర్తలకు స్పష్టంగా ఉండాలి. ఎన్నికల రోజే కాదు... ఎన్నికల ముందు, తర్వాత కూడా బూత్ వ్యవస్థ బలంగా కొనసాగాలి. అదే పార్టీకి శాశ్వత విజయానికి పునాది" అని ఏలూరి పేర్కొన్నారు.

**ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం...**

తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యం. దేశం గర్వించేలా అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోంది" అని తెలిపారు.

**సీఎం చంద్రబాబుతోనే ఏపీ అద్భుత ప్రగతి...**

"ఆంధ్రప్రదేశ్ మార్గదర్శి నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆయన అనుభవం, దూరదృష్టి, అంకితభావంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో సీఎం యజ్ఞంలా పనిచేస్తున్నారు" అని కొనియాడారు. ప్రతి కార్యకర్త కూడా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**కార్యకర్తలే పార్టీకి బలం బలగం...**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం అని ఏలూరి స్పష్టం చేశారు. "కార్యకర్తల సంక్షేమానికి కృషి చేసే ఏకైక పార్టీ టిడిపి. కార్యకర్తల అభ్యున్నతికి యువనేత నారా లోకేష్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు" అని తెలిపారు.

పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం లభించేలా వ్యవస్థ ఉండాలని అన్నారు.

**ఎన్నికల వ్యూహాలపై స్పష్టత...**

ఈ శిక్షణ శిబిరంలో బూత్ కమిటీ నిర్మాణం, ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు, ఓటర్లతో నిరంతర సంబంధం, సోషల్ మీడియా వినియోగం, ప్రతిపక్ష ప్రచారాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై ఎమ్మెల్యే ఏలూరి విపులంగా వివరించారు.

"ప్రజల నమ్మకం గెలవడమే అసలైన ఎన్నికల వ్యూహం" అని ఆయన పేర్కొన్నారు.

**సంస్థాగత బలోపేతమే లక్ష్యం...**

గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీని పటిష్టంగా నిలబెట్టాలంటే క్రమశిక్షణ, సమన్వయం తప్పనిసరిగా అవసరమని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. "కార్యకర్తే పార్టీకి ప్రాణం... ప్రతి కార్యకర్త కష్టానికి గుర్తింపు లభించేలా వ్యవస్థ ఉండాలి" అని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

08.04.26 బుధవారం


# కనిగిరి వైస్సార్సీపీలో
# గందరగోళం...!

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఏప్రిల్ 7)



ప్రకాశం జిల్లాలో ముఖ్యమైన నియోజకవర్గాల్లో ఒకటి కనిగిరి నియోజకవర్గం. ఇక్కడ వైసిపికి బలమైన ఓట్ బ్యాంక్ ఉంది. యాదవ సామాజికవర్గంతో పాటు రెడ్డి సామాజికవర్గం ఓట్ బ్యాంకు ఎక్కువగా ఉండడంతో వైసీపీకి కంచుకోటలా మారింది కనిగిరి నియోజకవర్గం. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన బుర్రా మధుసూదన్ యాదవ్ తిరుగు లేని విజయాన్ని సాధించాడు. 2024 ఎన్నికల్లో మరోసారి టికెట్ ఆశించినప్పటికీ వైసీపీ అధిష్టానం చేపట్టిన మార్పులు, చేర్పులతో కందుకూరుకు షిఫ్ట్ అయ్యాడు. మొన్నటి ఎన్నికల సమయంలో అనూహ్యంగా హనుమంతునిపాడు జడ్పీటీసీగా ఉన్న దద్దలా నారాయణ యాదవ్‌కు టికెట్ కేటాయించింది వైసీపీ అధిష్టానం. అయితే నారాయణకు టికెట్ కేటాయించడం పట్ల వైసిపి అధిష్టానంతో క్యాడర్ ఏకీభవించలేకపోయారు. ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రాను కాదని అదే సామాజికవర్గానికి చెందిన జడ్పిటిసి నారాయణ యాదవ్‌ను బరిలోకి దించినా వైసిపి ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. మొన్నటి ఎన్నిక సమయంలో నియోజకవర్గంలో మరోసారి బీసీలకు టికెట్ ఇచ్చామన్న ధీమాతో పాటు బలమైన రెడ్డి సామాజికవర్గం ఓట్లు తమకే పడతాయన్న వ్యూహంతో ముందుకెళ్ళింది వైసీపీ అధిష్టానం. అయితే కూటమి పార్టీల సునామీతో పాటు క్యాడర్‌లో నారాయణ యాదవ్ పట్ల ఉన్న వ్యతిరేకతతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దీంతో క్యాడర్ ఊహించినట్లే ఫలితం దక్కిందన్న టాక్ నడిచింది.

**పార్టీ ఇన్‌ఛార్జి దద్దాల తీరుతో పార్టీ డీలా..!**

కనిగిరి నియోజకవర్గంలో ఓటమి అనంతరం ఇంచార్జిగా వ్యవహరిస్తున్నాడు దద్దాల నారాయణ యాదవ్. ఓటమితో డీలా పడిపోయిన క్యాడర్‌లో జోష్ నింపి పార్టీని బలోపేతం చేయడంలో ఇన్చార్జి నారాయణ ఆశించిన స్థాయిలో చేయడం లేదన్న చర్చ కనిగిరిలో జోరుగా సాగుతోంది. స్థానిక ముఖ్య నేతలతో పాటు క్యాడర్‌ను నారాయణ సమన్వయం చేసుకోలేకపోవడమే ఇందుకు కారణమనే చెప్పుకోవచ్చు. పార్టీ కార్యకర్తల పెళ్లిళ్లకు, ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్లడం తప్ప పార్టీ కార్యక్రమాలు నిర్వహణను ఆశించిన స్థాయిలో చేయలేకపోతున్నాడనే ప్రచారం లేకపోలేదు. పార్టీని బలోపేతం చేయడంలో అంత సీరియస్‌గా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్న యాదవ, రెడ్డి సామాజికవర్గ నేతలతో ఏర్పడిన విభేదాలు పార్టీకి పెద్ద మైనస్‌గా మారాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీలో నెలకొన్న అసమ్మతి నేతలను సమన్వయం చేసుకోలేకపోవడం, పార్టీ నేతలకు, కార్యకర్తలకు అవసరం అయినప్పుడు నారాయణ అండగా లేకపోవడంతో పాటు నారాయణ తన పద్ధతిని మార్చుకోకపోవడంతో క్యాడర్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదని క్యాడర్ బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు సొంత సామాజికవర్గం కూడా కొంత మేర పట్టు లేకపోవడం పార్టీకి సంబంధించిన మద్దతు తెలిపే ప్రధాన సామాజికవర్గ నేతలను కలుపుకొని పోయే విషయంలో నారాయణ వ్యవహారశైలి వైసీపీ క్యాడర్‌ను మరింత అయోమయంలో పడేస్తున్నాయనే చర్చ నడుస్తుంది.

**నారాయణ పై రగులుతున్న కేడర్**

కనిగిరి నియోజకవర్గం వైసీపీలో అయోమయ పరిస్థితిలు నెలకొన్నాయి. ఇంచార్జ్ నారాయణ పట్ల కేడర్ నుంచి లీడర్ల వరకు అసంతృప్తి నెలకొందనే చెప్పుకోవచ్చు.. నారాయణ వ్యవహార శైలితో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయన్న ప్రచారం పార్టీలో నడుస్తోంది..రాష్ట్ర మాజీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్, మాజీ కనిగిరి మండల వైసీపీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, పెరుగు తిరుపతమ్మ లను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ అధిష్టానం తీసుకున్న నిర్ణయం పట్ల కనిగిరి వైసీపీ క్యాడర్‌లో కొంత వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పార్టీలో బలమైన సామాజికవర్గానికి చెందిన నాయకులను సస్పెండ్ చేయడంతో ఇంటి పోరు రచ్చ కెక్కి నట్లయిందని క్యాడర్ చర్చించుకుంటుంది. ఇంచార్జ్ నారాయణ సూచనలతో పార్టీ కోసం పని చేసిన నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధిష్టానం తీసుకున్న అనాలోచిత నిర్ణయమని కనిగిరి వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ఓటమి భారంతో డీలా పడిపోయిన క్యాడర్‌లో ప్రస్తుతం పార్టీలో నెలకొన్న పరిస్థితులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

**పార్టీ కీలక సీనియర్ నేత వైవీ కే నారాయణ ఝులక్..**

నారాయణ వ్యవహారంతో కనిగిరిలో వైసీపీ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందనే టాక్ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. గత కొంతకాలంగా నారాయణ పార్టీ క్యాడర్ తో పాటు స్థానిక ముఖ్యనేతలతో సఖ్యత లేకపోవడం పట్ల అధిష్టానం సైతం పలుమార్లు హెచ్చరించినట్లుగా తెలుస్తోంది. ఇటీవల కాలంలో పార్టీ ముఖ్య నేత వైవి సుబ్బారెడ్డి కనిగిరి పర్యటనలోనూ నారాయణ డుమ్మా కొట్టాడు. కనిగిరి ఇంట్లోనే ఉండి వైవిని కనీసం కలవకపోవడం చర్చనీయాంశమైంది. ఇక వైవి సుబ్బారెడ్డి ఏదైతే హాస్పిటల్‌కి వెళ్ళాడో అదే డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ పై సస్పెన్షన్ వేటుపడింది. వైవి సుబ్బారెడ్డికి సన్నిహితుడుగా ఉండే డాక్టర్ వైఎస్ఆర్సిపి వైద్య విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, మాజీ కనిగిరి మండల వైసీపీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించడం పట్ల క్యాడర్‌లో వ్యతిరేకత వ్యక్తమౌతోంది.

పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తూ విధేయులుగా ఉన్న డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్‌ను తప్పుడు ఆరోపణల పై సస్పెన్షన్ చేయించడం పట్ల పార్టీలో చర్చనీయాంశంగా మారింది. నారాయణ సూచనలతోనే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా క్యాడర్ భావిస్తోంది. కనిగిరిలో నెలకొన్న పరిస్థితులను సరిదిద్ది బలమైన నేతకు బాధ్యతలను అప్పగించి పార్టీని గాడిలో పెడతారని క్యాడర్ భావిస్తుంటే.. అందుకు భిన్నంగా పార్టీకి బలమైన సామాజికవర్గాలకు చెందిన నేతలను అధిష్టానం సస్పెండ్ చేయడం పట్ల వ్యతిరేకత మొదలైంది. కనిగిరిలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే పార్టీ చుక్కాని లేని నావలా మారుతుందన్న భావన క్యాడర్లో నెలకొంది. మరి కనిగిరి ఫ్యాన్ పార్టీలో నెలకొన్న పరిస్థితులను అధిష్టానం ఎలా సరిదిద్దుతుందో వేచి చూడాల్సిందే మరి...!

## చిన్నకండ్లేరు చెరువుకు గండి...

రైతుల్లో ఆందోళన
అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం
తక్షణ మరమ్మతులకు డిమాండ్





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 7)

మండల కేంద్రంలోని చిన్నకండ్లేరు చెరువుకు మళ్లీ గండి పడడంతో స్థానిక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో లీకేజీ కారణంగా చెరువులోని నీరు వృథా అయిన ఘటన మరువకముందే, మరోసారి అదే పరిస్థితి పునరావృతం కావడం రైతాంగాన్ని కలవరపెడుతోంది. ఎండాకాలం ప్రారంభమైన ఈ సమయంలో చెరువు నీరు వృథా కావడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట దిగువ భాగంలోని ఎడమ కాలువ నుంచి భారీగా నీరు బయటకు వెళ్లిపోతుండటంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. చెరువు అంతర్భాగంలో గండి పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువును పరిశీలించిన వెలుగొండ ప్రాజెక్ట్ తీగలేరు (టీ5) సాధన సమితి సభ్యులు, రైతు సంఘం నాయకులు జీవి గురునాథం, కె జానకి రఘు, కొత్త చిన్న మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలోని కంభం చెరువు తర్వాత రెండవ అతిపెద్ద చెరువు చిన్నకండ్లేరు అని తెలిపారు. ఇంత ముఖ్యమైన నీటి వనరును నిర్లక్ష్యం చేయడం తగదని వారు అన్నారు. గతంలో కూడా లీకేజీ ఏర్పడినప్పుడు తాత్కాలికంగా మాత్రమే మరమ్మతులు చేసి (తరువాయి 4లో...)

## జగన్ మాయల మరాటి

వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి కాకుండానే
పూర్తయిందని జాతికి అంకితం చేసారు
వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల
21 నెలల్లో వెలిగొండ పై ప్రత్యేక దృష్టి పెట్టాం
అష్ట, కష్టాలతో ఊరుకులు, పరుగులతో పని చేస్తున్నాం
రెండేళ్ల కిందటే పూర్తయిందనడం ఎంత విడ్డూరం
2026 జూన్ కల్లా పూర్తి చేసే లక్ష్యం పెట్టాం
మంత్రి నిమ్మల రామానాయుడు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 7)

శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో రెండు గంటల ప్రయాణం చేసి వెలిగొండ ప్రాజెక్టులో కొల్లం వాగు దగ్గర హెడ్ రెగ్యులేటర్ల పనులను మంత్రి నిమ్మల రామానాయుడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన టన్నెల్స్ లో మొదటి నుంచి చివరి వరకు మొత్తం 18.8 కిలోమీటర్లు ప్రయాణించి పనులను పరిశీలించారు. టన్నెల్-2లో 12వ కి.మీ దగ్గర చిక్కుకుపోయిన టిబిఎం మిషన్‌ను పరిశీలిం చారు. ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన వెలిగొండ ప్రాజెక్ట్‌ను జగన్ తన తుగ్లక్ పాలనలో అంధకారం చేశాడన్నారు. అబ్రక దబ్రా అంటూ వెలిగొండను పూర్తి కాకుండానే పూర్తయుందని ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేసిన మాయల మరాటి జగన్ అని మండిపడ్డారు. (తరువాయి 4లో...)

## భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 7)

భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్న జలధార కార్యక్రమాన్ని జిల్లాలో విజయ వంతంగా నిర్వహించేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కల్లెకర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు " జలధార" కార్యక్రమం నిర్వహణ పై ఇరిగేషన్, డ్వామా, గ్రౌండ్ వాటర్, పంచాయతీ రాజ్, వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖలు, సిపిడిసిఎల్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులతో వర్చువల్ గా సమావేశమై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలధార కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేలా ప్రజా ఉద్యమంగా అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన "జలధార" కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. "జలధార" కార్యక్రమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 15 వరకు జలధార కార్యక్రమంనకు సంబంధించి పనుల గుర్తింపు, ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 20 వరకు అందుకు సంబంధించిన పనుల మంజూరు, ఏప్రిల్ 21 నుండి జూలై 9 వరకు పనుల పురోగతి, జూలై 10 నుండి జూలై 14 వరకు దీని మీద పూర్తిస్థాయిలో రిపోర్టింగ్ చేయడం జరుగుతుందని, (తరువాయి 4లో...)

## జూన్ నాటికి వెలుగొండ పనులను పూర్తి చేయాలి

అధికారులకు జల వనరులశాఖ
మంత్రి రామానాయుడు ఆదేశం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 7)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధానమైన వెలుగొండ ప్రాజెక్టు పనులను జూన్ నాటికి పూర్తి చేసేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి ఎరిక్షన్ బాబులతో కలిసి కొల్లం వాగు నుంచి సొరంగం ద్వారా ప్రయాణించి పనుల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం దోర్నాల టన్నెల్ వద్దకు చేరుకొని ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. ఫీడర్ కెనాల్ వద్ద వెలిగొండ ప్రాజెక్టు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుపై ప్రతి పది రోజులకు ఒకసారి అడిగి తెలుసుకుంటున్న విషయాన్ని వివరించారు. 70 శాతం హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా టన్నెల్ వన్ లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని (తరువాయి 4లో...)

## మల్లవరం సచివాలయం ఆకస్మిక తనిఖీ






(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 7) మండలంలోని మల్లవరం గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం డీపీవో వెంకటేశ్వరరావు పారిశుధ్య నిర్వహణ, ఐ విఆర్ఎస్ కాల్స్ పై జీరో రిపోర్ట్ రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులకు వచ్చిన రెండు ఫోన్ కాల్స్‌లో ఒకరు స్పందించలేదు, మరొకరు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో జిరో రిపోర్ట్ వచ్చిందని ఇక్కడ ఫీల్డ్‌లో గ్రామస్తులతో మాట్లాడిన తరువాత పారిశుధ్య నిర్వహణ పై సంతృపికరంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్త సేకరణ పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ అధికారి మారెళ్ల పద్మ, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన డీఎంవో



(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, ఏప్రిల్ 7) సీఎస్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మార్కాపురం జిల్లా డీఎంవో డాక్టర్ రాహుల్ ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంవో మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, వడదెబ్బ, టీబీ వ్యాధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, డాక్టర్ షంషుద్దీన్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రకాశం జిల్లా చైర్మన్‌గా బసినేపల్లి రాజశేఖర్






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7) నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రకాశం జిల్లా చైర్మన్ బసినేపల్లి రాజశేఖర్ బాధ్యత స్వీకరణ కార్యక్రమం రాష్ట్ర రాజధాని అమరావతి లో ఎన్ డబ్ల్యూసి రాష్ట్ర చైర్మన్ అంబటి నవ కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్లబసినేపల్లి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర చైర్మన్ నవ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంపదల సంరక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు కోసం ప్రకృతి పట్ల ప్రజలకు, వ్యవస్థలకు మరింత బాధ్యతగా వ్యవహరించడంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలపరిచే దిశగా తాను కృషి చేస్తానని రాజశేఖర్ తెలిపారు. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడానికి సమాజంలోని ప్రతి వర్గం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# జగన్ మాయల మరాఠి









కూటమి ప్రభుత్వం 21 నెలల్లో వెలిగొండ పై ప్రత్యేక దృష్టి పెట్టి అష్ట, కష్టాలతో ఊరుకులు, పరుగులతో పని చేస్తున్నామన్నారు. అటువంటిది రెండేళ్ల కిందటే వెలిగొండ పూర్తి అయిపోయిందని జాతికి అంకితం చేయడం ఎంత విడ్డూరమన్నారు. మోసగాడినని, తను ఒక దగా కోరునని, అబద్దాలకు తను బ్రాండ్ అంబాసిడర్‌ను అని వెలిగొండ విషయంలో జగన్ తనకు తానే రుజువు చేసుకుని చరిత్ర హీనుడయ్యాడన్నారు. ఆధునిక కాలంలో దుష్ట పరిపాలన, తుగ్లక్ పాలన ఎలావుంటుందో చెప్పడానికి జగన్ పెద్ద ఉదాహరణ అన్నారు. హెడ్ రెగ్యులేటర్ రిటైనింగ్ వాల్, వింగ్స్‌కు సంబంధించి ఇప్పటికి 70 శాతం పని పూర్తయిందన్నారు. టన్నెల్ 2 నందు నేటికి మిగిలిన 2400 మీటర్ల లైనింగ్‌ను నెలకు 700 మీటర్ల చొప్పున జూన్ కల్లా పూర్తి చేసేలా ట్రాక్‌లో పెట్టామన్నారు. ఫీడర్ కెనాల్ పై 500 మీటర్ల హార్డ్ రాక్ తవ్వకం పని పూర్తి చేశామన్నారు. ఇటీవల చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన ఫీడర్ కెనాల్ 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ కాంక్రీట్ నిర్మాణం రెండు నెలల్లోనే 62 శాతం పూర్తి చేశామన్నారు. 20 కి.మీ ఫీడర్ కెనాల్ లైనింగ్ నేటికి 5 శాతం మాత్రమే పూర్తవ్వగా, మిగిలిన 95 శాతం వేగవంతం చెయ్యాలని ఆదేశించామన్నారు. ఏప్రిల్ నెల నుండి నిర్వాసితుల కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ బిల్లులు జమ చెయ్యడం ప్రారంభిస్తామన్నారు. వెలిగొండ పనుల పై చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి 2026 జూన్ కల్లా పూర్తి చేసే లక్ష్యం పెట్టారన్నారు. ఈ పర్యటనలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల



నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, వెలుగొండ ప్రాజెక్టు సీఈ కె రమేష్, ఎస్ఈ అబు తలీం, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.







# చిన్నకండ్లేరు చెరువుకు గండి...

సమస్యను మూలంగా పరిష్కరించలేదని వారు విమర్శించారు. ఈ సారి మాత్రం శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిమాండ్ చేశారు. చెరువు కట్ట ఇరువైపులా ముల్లకంపలు, అడవి మొక్కలు విస్తరించి ఉన్నప్పటికీ వాటిని తొలగించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువు ఆయకట్టు కింద వరి, మిరప, మొక్కజొన్న వంటి పంటలు సాగులో ఉన్నాయని, నీరు ఇలాగే వృథా అయితే పంటలతో పాటు త్రాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య ఎదురవుతున్నప్పటికీ చెరువు పునరుద్ధరణపై ఇచ్చే హామీలు ఆచరణలోకి రావడం లేదని విమర్శించారు. చిన్నకండ్లేరు చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే ఉమ్మడివరం, గారపెంట, చెన్నపాలెం, అక్కపాలెం, శతకోడు, తెల్లగట్ల వంటి గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు తెలిపారు. కాబట్టి చెరువు కట్టకు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్ట్ తీగలేరు సాధన సమితి సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం



ప్రధానంగా భూగర్భ జలాల పెంపు, సంరక్షణ, నీటి భద్రత తదితర ప్రధాన అంశంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. చెరువుల పూడికతీత పనులు, కాలువల మరమ్మతులు, నీటి సంరక్షణ చర్యలపై అవగాహన, సమర్ధవంతమైన నీటి నిర్వహణపై దృష్టి సారించేలా దిశగా ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీడీలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. అలాగే తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించేలా ఉద్యాన పంటలను ప్రోత్సహించడంతో పాటు బిందు, తుంపర్ల సేద్య పరికరాల వాడకంపై కూడా క్షేత్ర స్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాలను భాగస్వాములు చేయడంతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాలు గ్రామా స్థాయిలో విస్తృతంగా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయడంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎంపీడిఓలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి జడ్పీ సీఈవో చిరంజీవి, ఇరిగేషన్, సిపిడిసిఎల్, పంచాయతీరాజ్ ఎస్ఈలు వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, అశోక్ కుమార్, వ్యవసాయ, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ జెడి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి గోపిచంద్ పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి ఎంపీడీఓలు, ఏపిఓలు, ఏపీడీ, సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జూన్ నాటికి వెలుగొండ పనులను పూర్తి చేయాలి



అధికారులకు తెలిపారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన 900 కోట్ల రూపాయలను ఏప్రిల్ నుంచి జూన్ వరకు విడతల వారీగా చెల్లిస్తామని వివరించారు. వచ్చే రెండు నెలల్లో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ప్రాజెక్టుకు సంబంధించి 1200 కోట్ల బిల్లులు చెల్లించామని వివరించారు. ఇన్ని పనులు ఉన్న వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు చెప్పి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాయల మరాఠీని మరిపించేలా వ్యవహరించారని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించి తమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, వెలుగొండ ప్రాజెక్టు సీఈ కె.రమేష్, ఎస్ఈ అబు తలీం, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల సమస్యలను పరిష్కరించాలి
# భౌతికదాడులకు దిగితే సేవలు నిలిపివేస్తాం

## మీడియా సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నేతలు




**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఏప్రిల్ 7)**
రాష్ట్రంలోని ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల సమస్యల పై రాష్ట్ర ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లోని ఏపిడబ్ల్యుజెయులో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూజారి సుధీర్, కొనా శరత్‌లు మాట్లాడారు.

**ప్రధాన సమస్యలివే....**

పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులలో ప్రపంచం మొత్తం పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో నిజమైన గృహ వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పెట్రోలియం మంత్రిత్వ శాఖలు భారత ప్రభుత్వం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కొన్ని నియమ నిభంధనలు రూపొందించాయి. వీటిని అమలు పరచవలసిన భాధ్యతని గ్యాస్ పంపిణీదారుణి జవాబుదారీ చేశారు. అమలు పరిచే క్రమంలో నెలకొన్న తాత్కాలిక ఇబ్బందుల వల్ల పంపిణీదారులు ఎల్‌పిజి సిబ్బంది పై అక్కడక్కడ భౌతిక దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని గ్యాస్ డీలర్ల సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఇలాంటి అల్లరి మూకల పై కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్యాస్ డీలర్ల సంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇచ్ఛాపురం సంఘటనలో పోలీసు వారి చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వారిని అరెస్టు కూడా చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్యాస్ ఏజెన్సీ నందు యధావిధిగా గ్యాస్ సప్లై చేయడం జరుగుతుందన్నారు. కావున వినియోగదారులు తొందరపడి అవసరం లేకున్నా బుక్ చేయవద్దని మనవి చేశారు. బుక్ చేసుకుని రెఫరెన్స్ నెంబర్, ఓటిపి వచ్చిన వినియోగదారులు గ్యాస్ డీలర్ వద్దకు ఖాళీ సిలిండర్ తీసుకుని రాకూడదని విన్నవించారు. మీ ఇంటి వద్దకే సిలిండర్ డెలివరీ చేయబడుతుందన్నారు.

సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, వుదంతాలను దయచేసి ఎవరు నమ్మవద్దు అని విజ్ఞప్తి చేశారు.

**ఈకేవైసీ తప్పని సరి..**

భారత ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి ఈ కేవైసీ తప్పనిసరిగా చేపించుకోవాలన్నారు. అలా చేయించుకోని యడల గ్యాస్ సరఫరా చేయబడదని గమనించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 75% మంది ఈకేవైసీలు చేయించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన వారు కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని విన్నవిస్తున్నామన్నారు. వినియోగదారుడు మరణించిన యడల వారి కుటుంబ సభ్యుల పేరు మీద నిబంధనల ప్రకారం మీ గ్యాస్ డీలర్‌ని చేరుకొని తక్షణమే మార్పించుకొని గ్యాస్ పొందగలరన్నారు.

**సాఫ్ట్వేర్‌లో ఉన్న సాంకేతిక లోపాలు డిఏసి/ఓటిపి వ్యవస్థలో తలెత్తుతున్న ఇబ్బందులు**

పట్టణ ప్రాంతాల్లో ఉన్న వినియోగదారులు 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వినియోగదారులు 45 రోజులకు ఒకసారి గ్యాస్ రీఫిల్ బుక్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం వారు కల్పించారు. కావున ఈ విషయాన్ని గమనించి తదనుగుణంగా ప్లానింగ్ చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వపు నిబంధనల ప్రకారం ఓటిపి లేదా డిఏసి కోడ్ లేనిదే గ్యాస్ డెలివరీ ఇవ్వడం కుదరదన్నారు. కావున ఇది గమనించి మీ యొక్క మొబైల్ నెంబర్‌ను మీ గ్యాస్ డీలర్ వద్ద కచ్చితంగా నమోదు చేయించుకున్నట్లయితే మీకు డిఏసి నంబరు కేటాయింపబడుతుందన్నారు.

అలాగే మీ ఇంటి వద్ద ఫుల్ సిలిండర్ డెలివరీ చేసినప్పుడు మాత్రమే డిఏసి కోడ్ డెలివరీ బాయ్‌కి ఇవ్వాలన్నారు. డిఏసి కోడ్ గానీ ఖాళీ సిలిండర్ గాని ముందుగా ఇవ్వకూడదన్నారు. అలా ఇచ్చినచో గ్యాస్ ఏజెన్సీ వారు ఎలాంటి బాధ్యత వహించరని స్పష్టం చేశారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ వారు నిర్దేశించిన వినియోగదారులకు మాత్రమే కమర్షియల్ సప్లైలో కొంత భాగం కేటాయించబడిందన్నారు. వీరిలో హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్టల్‌లు, ఇండస్ట్రియల్ క్యాంటీన్ లు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కమర్షియల్ వినియోగదారులు కూడా పొదుపుగా గ్యాస్ వాడుకోవాలని సూచించారు. గ్యాస్ డీలర్, వారి సిబ్బందికి సహకరించి మీ యొక్క గ్యాస్ రీఫిల్‌ని సకాలంలో తీసుకోవాలన్నారు. అవాస్తవాలను నమ్మి గ్యాస్ డీలర్, వారి సిబ్బంది పై ఎలాంటి భౌతిక దాడులకు పాల్పడినా సరే మా యొక్క సర్వీసులను రాష్ట్రవ్యాప్తంగా నిలుపుదల చేయుటకు వెనకాడమని తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో గౌరవధ్యక్షుడు శంకర్, సతీష్‌రెడ్డి, త్రిమూర్తి రాజు, సుబ్బారెడ్డిలు అన్ని జిల్లాల అధ్యక్షులు, ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# స్నేహ సేవిక సమితికి విరాళం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)**
ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి నిర్వహిస్తున్న శక్తి సదన్ అనే మహిళా షెల్టర్ హోమ్‌కి (పిజిఎన్ఎఫ్) ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం వారు భవనాన్ని కట్టిస్తున్న నేపథ్యంలో స్నేహ సేవిక సమితి ఒంగోలు వారు ఆ షెల్టర్ హోమ్‌కి లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వటం జరిగింది. బాధిత మహిళల కోసం తమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు స్నేహ సేవిక సమితి నిర్వాహకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్లు అయినా డాక్టర్ కొర్రపాటి



సుధాకర్ గారు అలాగే షెల్టర్ హోమ్ నిర్వాహకురాలు శ్రీమతి తేళ్ల అరుణ ఆ విరాళాన్ని అందుకొని బాధిత మహిళల కోసం స్నేహసేవిక సమితి మహిళలు చేసిన ఈ గొప్ప సహాయాన్ని ప్రశంసించారు. ఇంతకుముందు కూడా స్నేహ సేవికా సమితి, ప్రతి సంవత్సరం చాలా పెద్ద మొత్తంలో ప్రకృతి వైపరీత్యాలకు అలాగే బాల ఆశ్రమాలకు, విద్య కోసం వారు ఎన్నో దానాలు చేసి ఉన్నారు. ఈ నేపద్యంలోనే ఈ బాధిత మహిళ ఆశ్రమ భవనానికి లక్ష రూపాయలు విరాళంగా హోటల్ మౌర్య ఇన్‌లో జరిగిన సమావేశంలో నిర్వాహకులు డాక్టర్ కొర్రపాటి సుధాకర్, తేళ్ల అరుణకి అందించారు.

# మున్సిపాలిటీలో పారిశుధ్యం పై ఎమ్మెల్యే ఇంటూరి అసంతృప్తి

**పర్యవేక్షణ సరిగాలేదని అధికారులపై ఆగ్రహం**
**మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ పై సమీక్ష చేసిన ఎమ్మెల్యే**
**ఇకనుంచి ఉదయాన్నే వార్డుల్లో పర్యటిస్తా**
**ఇంటూరి నాగేశ్వరరావు**
**తీరు మారకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరిక**





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 7)**
కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగం పనితీరు సరిగాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బంది పై పర్యవేక్షణ కూడా సరిగా లేదన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి ఆకస్మికంగా వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు కమిషనర్ అనూషతోపాటు శానిటేషన్ సూపర్వైజర్లు, మేస్త్రిలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం సరిగాలేదంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొన్నిచోట్ల రోజుల తరబడి కాలువల్లో చెత్తను క్లియర్ చేయడం లేదని, మరి కొన్ని చోట్ల తూతూమంత్రంగా పనిచేస్తుండడం వల్ల దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ అలాంటి పరిస్థితి ఉందో, వార్డుల వారీగా ఆయన వివరించారు. కమిషనర్ ఒక్కరే సక్రమంగా పనిచేస్తే సరిపోదని, సిబ్బంది మొత్తం బాధ్యతతో పనిచేసినప్పుడే శుభ్రమైన వాతావరణం ఏర్పడి ప్రజల హర్షిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా చెత్త పేరుకుపోయే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. దుకాణదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు రాత్రిపూట చెత్తను రోడ్లు, సైడ్ కాలవల్లో ఇష్టానుసారంగా వేస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటివారికి పారిశుధ్యంపై ఎందుకు అవగాహన కల్పించడం లేదని కమిషనర్ ను ప్రశ్నించారు. వారందరికీ అవగాహన కల్పించాలని, అప్పటికి మార్పు రాకపోతే జరిమానాలు విధించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే, వారిని వెంటనే తొలగించాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. మరో వారం రోజుల్లో మున్సిపాలిటీలో పరిస్థితి చక్కబడాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులతో అన్నారు. వారం తర్వాత ప్రతి రోజూ ఉదయాన్నే తాను కూడా స్వయంగా వార్డుల్లో పర్యటనకు వస్తానని చెప్పారు.

# నేటి నుంచి మూడు రోజుల పాటు

**రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజాముల బల ప్రదర్శన**
**జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్‌కు ప్రత్యేక ఆహ్వానం**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 7)**
జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ కార్యాలయం నందు మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజాముల బల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌ని ఆహ్వానించడం జరిగింది. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కాశీనాథ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు, నరసింహారావు, జనసేన నాయకులు బెల్లంకొండ గోపి, కంభం వెంకటరమణ, పిన్నెబోయిన శ్రీనివాసులు, దొడ్డ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ బ్యాంక్ చైర్మన్ జవ్వాజి




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 7)**
వేసవికాలం తీవ్ర ఎండలు దంచికొడుతున్న వేళ, ప్రజల దాహం తీర్చేందుకు మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో మంగళవారం ఉచిత చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ జవ్వాజి రామాంజులరెడ్డి మాట్లాడుతూ ఎండలో ప్రయాణించే ప్రజలు, కాలినడకన వెళ్లేవారికి తాగునీటి అవసరం ఎంత ముఖ్యమో గుర్తించి ప్రభుత్వం తరపున ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఇది పెద్ద ఉపశమనం కలిగించనున్నదని, వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, హార్టికల్చర్ అసిస్టెంట్ అనిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మంజీరా, మహిళా పోలీస్ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 7)**
గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కడవకుదురు జాతీయ రహదారి 216ఏ పై మంగళవారం చోటు చేసుకుంది. హైవే సిబ్బంది అదించిన వివరాలు మేరకు చిన్నగంజాం మండలం సోపిరాలకు చెందిన అలహరి సూర్యనారాయణ, కరణం శ్రీను బేల్దారి పని నిమిత్తం వేళ్ళుతుండాగా గుర్తుతెలియని వాహనం డీకోనటంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది చీరాల అసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన అలహరి సూర్యనారాయణ పరిస్థితి విషమంగా వుందని వారు తెలిపారు.

# ఉపాధి పనులు పరిశీలించిన ఏపీవో గాయత్రి లక్ష్మి



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 7)
మండలంలోని దైవాల రావూరు గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను ఏపీవో గాయత్రి లక్ష్మి పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న పనుల ప్రగతిని పరిశీలించి, పనులు జరుగుతున్న తీరుపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులు నిబంధనలకు అనుగుణంగా, కొలతల ప్రకారం నిర్వహించాలని కూలీలకు సూచించారు. కొలతల మేరకు పనులు పూర్తి చేస్తే ప్రతి రోజూ రూ.200 వేతనం పొందవచ్చని ఆమె తెలిపారు. పనుల నాణ్యతను కాపాడడంతో పాటు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. అలాగే, జాబ్ కార్డ్ లేని అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# పేదల జీవితాల్లో మార్పు లక్ష్యంగా పనిచేయాలి

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 7)
ప్రభుత్వ ఉద్యోగులు కేవలం జీతం కోసమే కాకుండా, పేదల జీవితాల్లో మార్పు తెచ్చే లక్ష్యంతో పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచించారు. వినుకొండ పురపాలక సంఘ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు, రైతులకు ఏది అవసరమో గుర్తించి ఆ పనులకే నిధులు ఖర్చు చేసే బాధ్యతను అధికారులు తీసుకోవాలని, అంకితభావంతో పనిచేసినప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' కార్యక్రమాన్ని నియోజకవర్గవ్యాప్తంగా విజయవంతం చేయడానికి అధికారులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి హామీ నిధులు, మ్యాచింగ్ గ్రాంట్లను సద్వినియోగం చేసుకుంటూ చెక్ డ్యామ్‌లు, వాటర్ షెడ్స్, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో 'నీరు–చెట్టు' కార్యక్రమం ద్వారా బొల్లాపల్లి వంటి మెట్ట ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగాయని, తద్వారా అక్కడి రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారని గుర్తుచేశారు. రైతుల ఆదాయం రెండు మూడు రెట్లు పెరిగేలా హార్టికల్చర్ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లాభసాటి వ్యవసాయం దిశగా రైతాంగాన్ని చైతన్యపరచడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వినుకొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డ్వామా పిడి ఎ సిద్ధ లింగమూర్తి, నూజండ్ల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ రెడ్డి, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లవరంలో చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 7)
మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిబంధనలను అనుసరించి మంగళవారం మండలంలోని మల్లవరం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఈఓపిఆర్‌డి శోభన్ బాబు, పంచాయతీ కార్యదర్శి మారెళ్ల పద్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోతురాజు కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలి

## పోతురాజు కాలువకు ఇరువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించాలి

## కాలువల్లో వ్యర్థాలను తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

## భగత్‌సింగ్ కాలనీలో ప్రజా పోరు బాట కార్యక్రమంలో సిపిఎం డిమాండ్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)
పోతురాజు కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 5వ డివిజన్‌లోని భగత్‌సింగ్ కాలనీలో నిర్వహించిన ప్రజా పోరు బాట కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ, గ్రీన్ సిటీ పేర్లతో అభివృద్ధి జరిగిపోతున్నట్లు పాలకులు చెబుతున్నప్పటికీ, 5వ డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. రోడ్లు లేకపోవడం, కాలువలు సక్రమంగా లేకపోవడం, మంచినీటి సౌకర్యం లేకపోవడం, పోతురాజు కాలువకు ఆనుకొని ఉన్న కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోతురాజు కాలువకు ఇరువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, జమ్ము,తుంగ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్‌సింగ్ కాలనీ, గోపాల్ నగరం, మహేంద్ర నగరం, నీలంపాలెం, కరుణా కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. మురుగునీటిని తొలగించాలని, దోమల మందు పిచికారీ చేయాలని, రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని, మురుగునీరు వెళ్లేలా కాలువలను సక్రమం చేయాలని ప్రజలు కోరినట్లు చెప్పారు.అలాగే వ్యక్తిగత పింఛన్లు ఇవ్వాలని అనేక మంది కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి నేటికీ స్థలాలు కేటాయించలేదని ప్రజలు వాపోయినట్లు పేర్కొన్నారు. గతంలో ఒక సెంట్ స్థలం కేటాయిస్తూ భరోసా పత్రాలు ఇచ్చినా, ఇప్పటి వరకు స్థలాలు చూపించలేదని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం కరుణా కాలనీలోని కబేళ స్థలాన్ని సందర్శించిన నాయకులు, అక్కడ సామాజిక భవనం నిర్మించాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, ఎన్. వీరాస్వామి, నగర కమిటీ సభ్యులు హుస్సేన్, మహేష్, స్థానిక నాయకులు విజయమ్మ, వెంకట్రావు, రామకృష్ణ, కె శ్యామ్, భావనారాయణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ ఆసియా యుద్ధం ప్రపంచానికి ముప్పు యుద్ధ విరమణ చేయాలి

## యూటీయఫ్, జెవివి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 7)
ప్రస్తుతం పశ్చిమ ఆసియాలోని ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తున్నట్లు తక్షణమే అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విరమణ చర్యలు తీసుకోవాలని కోరుచున్నట్లు యూటీయఫ్ సీనియర్ నాయకులు మీగడ వెంటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం గిద్దలూరు యూటీయఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత 38 రోజులుగా జరుగుతున్నా అమెరికా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచానికి ముప్పుగా మారిందన్నారు. అనేక దేశాలు గ్యాస్, ఆయిల్ కొరతతో ఆర్థిక సంక్షోభంలో కురుకుపోయాయని, హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే ఇంధన సరఫరా ఆగిపోవడంతో, ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దానితో మన దేశంలో కూడా ఎరువులు, విద్యుత్, పారిశ్రామిక రంగాలు, హోటల్ పరిశ్రమ భారీగా దెబ్బ తిన్నదని తెలిపారు. ఈ ప్రభావం నిత్యావసర వస్తువులపై పడే అవకాశం ఉందని తెలిపారు. అంతర్జాతీయముగా చమురు ధరల దాటికి రూపాయి విలువ డాలర్ తో ?95 లకు పడిపోయిందని. దానితో దేశంలో దిగుమతులు పెరిగి ఎగుమతులు తగ్గి, వాణిజ్య లోటు భారీగా పెరిగిందన్నారు.తద్వారా విదేశీ అప్పులు కూడా పెరిగిపోతున్నాయి అన్నారు. జెవివి నాయకులు స్వరూపరెడ్డి మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదంతో మొన్న వెనుజుల అధ్యక్షులు మధురోను, అతని భార్యను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లి అమెరికా లో జైల్లో బంధించడం, తదుపరి క్యూబా, మెక్సికో, గ్రీన్ ల్యాండ్ అని ప్రకటించడం చూస్తుంటే అమెరికా అన్ని దేశాలను స్వాదీనం చేసుకుని ఏకచత్రాధిపత్యంగా ప్రపంచాన్ని ఏలాలని చూస్తున్నట్లు ఉంది అన్నారు. కాబట్టి ఐక్య రాజ్య సమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపే చర్యలు తీసుకోవాలని, ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం నుండి కాపాడాలని కోరుచున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీ ఆవులయ్య, యుటీయఫ్ మాజీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వేమయ్య, జయచంద్ర రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

# అన్నవరం సత్యనారాయణ స్వామి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్‌గా అనంత లక్ష్మమ్మ

## అనంత లక్ష్మమ్మకి శుభాకాంక్షలు తెలియజేసిన ఈవీఎస్ లక్ష్మి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)
అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ట్రస్టు బోర్డు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సూచనలతో దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌లలో ఒంగోలు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు తేలకుట్ల అనంత లక్ష్మమ్మని ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమించడం పై ఒంగోలు నగర అంగన్వాడీ సాధికారిత ప్రధాన కార్యదర్శి, 24వ డివిజన్ తెలుగుదేశం మహిళా నాయకురాలు ఈవీఎస్ లక్ష్మీ హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు తెలుగుదేశంపార్టీ మొదట నుంచి ప్రాధాన్యత ఇస్తుందని, కష్ట పడిన కార్యకర్తలు అందరికీ న్యాయం చేసేలా ఆలోచనలు చేస్తూ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఒంగోలు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు పరుగులు పెట్టిస్తున్నారని ఆమె ఓ ప్రకటనలో తెలియజేశారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆదేశం





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 7)
జల ధార – నీటి భద్రత కార్యక్రమం ద్వారా రాబోయే 100 రోజుల్లో మార్కాపురం జిల్లాలో భూగర్భ జలాల పెంపే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులు ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాలోని ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకంలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. ముందుగా పది రోజుల యాక్షన్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తరువాత 80 రోజుల ప్రణాళికలో జిల్లాలోని చెరువుల పూడిక తీయడంతోపాటు, భూగర్భ జలాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వివరించారు. జలాల మట్టాన్ని కనీసం 1.5 మీటర్లు పెంచాలన్నారు. వేసవికి ముందు 6 మీ లోపు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

# 25న ఘనంగా శతాబ్ది వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పంగులూరు, ఏప్రిల్ 7)
మండలంలోని కోటపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఈనెల 25న శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. పాఠశాల స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు వేడుకలను ఆర్భాటంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేణుబాబు మాట్లాడుతూ యూపీ పాఠశాలగా ప్రారంభమైన ఈ విద్యాసంస్థ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఎదిగి ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల సహకారం అమూల్యమని తెలిపారు.పూర్వ విద్యార్థులు తమ పాఠశాలపై ఉన్న అభిమానం వ్యక్తం చేస్తూ, ఇక్కడే చదివి ఉపాధ్యాయులుగా సేవలందించడం గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. శతాబ్ది వేడుకలకు మంత్రులు, విద్యాశాఖ అధికారులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

# అకాల వర్షాలతో పంటల దెబ్బతిన్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

## పిడుగుపాటు వల్ల మృతి చెందిన రైతులు, వలస కూలీల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి

### ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 7)**
అకాల వర్షాలతో, వడగండ్ల వానతో కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాలలో తీవ్ర నష్టం పిడుగులు పడటంతో దాదాపు 9 మంది రైతులు వ్యవసాయ కూలీలు మృతి చెందారని, మరో 6 మంది తీవ్ర గాయాలతో వివిధ హాస్పిటల్లో చికిత్స పొందు తున్నారనీ,ఒక్క ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే! ఆరు మంది మృత్యువాత పడ్డారు మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం వితోధికంగా ఆదుకోవా లని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ సైదా నేడు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అకాల వర్షాల వల్ల వరి, మామిడి తోటలు,మొక్కజొన్న లాంటి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నా యనీ,అనేక వాణిజ్య, మరియు కూరగాయల పంటలు దెబ్బతిన్నా యి ఓ పక్క పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక! రైతన్నలు అల్లాడుతుంటే,!అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పంట నష్ట పరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందాని ఆయన తెలిపారు. వడగండ్ల వానతో మృతి చెందిన తొమ్మిది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబా నికి 50 లక్షల చొప్పుననష్టపరిహారం చెల్లించాలని షేక్ సైదా ప్రభుత్వాన్ని కోరారు.

# రాష్ట్రపతి ముర్ముకి హృదయపూర్వక కృతజ్ఞతలు

### ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 7)**
ఐదున్నర కోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అయిన అమరావతి రాజధాని మరింత బలపడింది. పార్లమెంటులోని ఉభయసభలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలపడం చారిత్రాత్మక ఘట్టం. నేడు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అమరావతి బిల్లుకు ఆమోదం తెలపడం ద్వారా, ప్రతి తెలుగు మనసులో నిలిచిపోయే ఒక విశిష్ట నిర్ణయంగా మారింది. ఈ నిర్ణయం వల్ల తెలుగువారు తమ రాజధాని అమరావతి అని గర్వంగా ప్రకటించే స్థాయికి చేరుకున్నారు. గత ఐదేళ్లలో ఎదురైన అనిశ్చితి, విమర్శలకు ముగింపు పలుకుతూ, భవిష్యత్తుపై నమ్మకాన్ని, ధైర్యాన్ని ఈ నిర్ణయం కలిగించింది. రాష్ట్రపతి ఆమోదం, తెలుగు ప్రజలపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న గౌరవం, నిబద్ధతకు నిదర్శనం. అమరావతిని శాశ్వత రాజధానిగా నిలబెట్టే ఈ చారిత్రాత్మక ప్రయాణంలో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్క తెలుగు వ్యక్తికి గర్వకారణం. ఇప్పుడందరం ఒక్క స్వరంతో నినదించాల్సిన సమయం వచ్చిందన్నారు.

# రైతు సమస్యల పై ప్రభుత్వం దృష్టి సారించాలి





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 7)**
పొగాకు కొనుగోళ్లు లో ప్రభుత్వ రంగసంస్థలు భాగస్వామ్యం ఉండాలని, గతంలో రీ సర్వేలో జరిగిన రెవిన్యూ పొరపాట్లను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి సవరించి రైతాంగాన్ని ఆదుకోవాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రంలోని స్థానిక ప్రగతి స్కూల్లో ఏపీ రైతు సంఘం వలేటివారిపాలెం మండల మహాసభ జరిగింది. ఈ సభకు మాదాల రమణయ్య అధ్యక్ష వహించారు. ఈ సభ లో సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్, రైతు సలహాదారుడు మువ్వా నరేంద్ర, మండల సీనియర్ రైతు నాయకులు వలేటి నరసింహం మాట్లాడారు. మండలంలోని 9 గ్రామాలకు చెందిన రైతులు ఈ సభలో పాల్గొన్నారు. పాల్గొన్న మాదాల రమణయ్య మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కందుకూరు నియోజకవర్గ స్థాయిలో అఖిలపక్ష రైతు మీటింగ్ నిర్వహిస్తామని, మార్కెట్ సంక్షోభం,నీటి వనరులు, గిట్టుబాటు ధరల కోసం కృషి చేస్తామని కోరారు. పాలకవర్గాలు కూడా రైతుల సమస్యలపై సానుకూల దృష్టితో వ్యవహరించాలని కోరారు. రైతులను భూమి నుండి వేరుచేసి భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా రైతులను అంతా ఐక్యం చేసి పోరాడుతామన్నారు. యుద్ధం కారణంగా రైతులకు వస్తున్న సమస్యలపై కృషి చేస్తామని ప్రకటన చేశారు. మండల కమిటీ ఎన్నికల ప్రక్రియను కార్మిక నాయకుడు జీవీబీ కుమార్ నిర్వహించారు. అనంతరం మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వలేటివారిపాలెం మండల కన్వీనర్ గా మాదాల రమణయ్యను, కమిటీ సభ్యులుగా మువ్వా.నరేంద్ర, గొర్రెపాటి రమేష్, మానికొండ మదన్ చౌదరి, నవ్వులూరి వెంకటేశ్వర్లు, చింతలపూడి మాధవరావు, పిల్లి రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఈ నెల 12న ఒంగోలులోని రంగా భవన్‌లో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

# కేపీఐలో సాధించిన పురోగతే నిదర్శనం

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)**
అధికారుల పనితీరుకు ‘ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ’ (కేపీఐ)లో సాధించిన పురోగతే నిదర్శనమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఈ దిశగా మండల స్థాయి లక్ష్యాలను గుర్తించి, స్వర్ణాంధ్ర వెబ్ సైట్ లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రాథమిక రంగాలకు సంబంధించిన లక్ష్యాలను గుర్తించడం, వాటిని సాధించడంపై మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ అంశాలలో సాధించిన పురోగతి ప్రతిబింబించేలా కే.పీ.ఐ.లను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఆయా రంగాలలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలను గుర్తించే బాధ్యత జిల్లాస్థాయి అధికారులకు కేటాయించిందన్నారు. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సర లక్ష్యాలు, పురోగతి, కొత్త మండలాల కలయిక, కొన్ని మండలాలు విడిపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని నూతన ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 19వ తేదీ నాటికి సంబంధిత వెబ్ సైట్ లో వీటి నమోదు ప్రక్రియను కూడా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధన పై తక్షణమే దృష్టి సారించాలని, తొలి త్రైమాసికం ఎంతో కీలకమని చెప్పారు. శాఖా పరంగా ఉన్న విధులను నిర్వహించడంతో పాటు కేపిఐ విషయంలోనూ ప్రత్యేక లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఈ దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్య, ఉద్యానవన, మార్కెటింగ్, గనులు, అటవీ, సహకార, పట్టు పరిశ్రమ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# అన్నంగి, మద్దిపాడులో వాహన పటుత్వ పరీక్షలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)**
ఒంగోలు, దర్శి, కందుకూరు, మార్కాపురం కార్యాలయాల్లో జరుగు వాహన పటుత్వ పరీక్షలు (ఎఫ్ సి) ఇక పై అనగా 09.04.2026 నుండి కెపి ఎంటర్ప్రైజెస్ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ అన్నంగి, మద్దిపాడు నందు జరుపబడునని ప్రకాశం జిల్లా, మార్కాపురం జిల్లా రవాణా వాహనదారులకు ఒంగోలు ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల సూచించారు. వాహనదారులందరూ కూడా ఈ అవకాశమును సద్వినియోగపరచుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. 08.04.2026కు ముందు స్లాట్స్ బుక్ చేసుకున్న వారు క్యాన్సిల్ చేసుకుని 09.04.2026 కు బుక్ చేసుకోవాల్సిందిగా ఆ ప్రకటనలో ఆమె కోరారు.

# వేటపాలెంలో బాలుడు లభ్యం తల్లిదండ్రుల కోసం అన్వేషణ




**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఏప్రిల్ 7)**
కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుండి వేటపాలెం వచ్చిన ఓ 12 ఏళ్ల బాలుడు స్థానికంగా లభ్యమయ్యాడు. ఆదివారం ఆకలితో బాధపడుతున్న బాలుడిని గుర్తించిన బాల గోపి అనే వ్యక్తి తన ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి, అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకురాగా, అతని పేరు రాజు (తండ్రి సంతోష్, తల్లి సరిత, అన్న అజ్జు)గా చెప్పినట్లు ఎస్ఐ జనార్దన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో తన తండ్రి రోడ్డు పనులు చేస్తాడని బాలుడు వెల్లడించినట్లు పేర్కొన్నారు. బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఎవరికైనా వివరాలు తెలిసినట్లయితే వేటపాలెం ఎస్ఐకి సమాచారం అందించాలని జనార్దన్ కోరారు.

# తేలకుట్ల అనంత లక్ష్మీకి పలువురి అభినందన







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)**
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పార్టీ కోసం పనిచేస్తూ, పార్టీలో ఎన్నో పదవులు అధిరోహించిన ఎటువంటి గర్వం లేకుండా పార్టీలో పని చేస్తూ, ఎన్నో ఓడిదుడుకులు ఎదుర్కొని పార్టీ కష్ట కాలంలో కూడా పార్టీ వెన్నంటే నడిచి పార్టీ కోసం అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీ మాటే శాసనంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు తేలకుట్ల అనంత లక్ష్మీ పని చేశారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సూచనల మేరకు కూటమి ప్రభుత్వం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఒంగోలు పార్లమెంట్, ఒంగోలు నియోజకవర్గ ఐటిడిపి సభ్యులు అనంతమ్మని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరావు, ఐటిడిపి నాయకులు గోపు వీరాంజనేయులు, మన్నెపల్లి హరికృష్ణ, వాయల మల్లిఖార్జున, ఓలేటి భార్గవ్ సాయి, గంజేరుపల్లి జగదీష్, షేక్ సిద్దిక్ (బబ్లు), పాలపర్తి సురేంద్ర, అలుగుమల్లి శివకృష్ణ, పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి

## ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)

పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సరదా కోసం పిల్లలు, యువకులు గ్రామాలు, పట్టణాల శివార్లలోని కుంటలు, చెరువులు, కాలువలు, బావుల వద్దకు లేదా ఈతకు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రమాదకర జలాశయాల్లోకి వెళ్లి పలువురు మృత్యువాత పడి కుటుంబాలకు తీరని విషాదం మిగిల్చిన సంఘటనలు ఉన్నాయని ఎస్పీ గారు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఈతకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సరదాగా వెళ్లిన పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ, వారు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత రాకపోతే కలిగే ప్రమాదాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జలాశయాలు, బావులు, కాలువలు, చెరువులు, కుంటల్లో ఈత కొట్టేముందు, ఈత తెలిసిన వారు కూడా నీటి లోతును కర్రల సాయంతో ముందుగా పరిశీలించుకోవాలన్నారు. నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటే ఈతకు వెళ్లకూడదని, విహారయాత్రలు లేదా తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల్లోనే స్నానం చేయాలని, లోపలికి వెళ్లరాదని, ఈత రాకపోయినా స్నేహితులు బలవంతం చేయకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెరువులు, కొలనులు, జలపాతాలు, నీటి కుంటలు, ఏరుల వద్దకు ఎవరూ ఈతకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. చెరువులు, బావులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నీటి లోతును తెలియజేసే సూచనలు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం సంభవించిన వెంటనే డయల్ 112 కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

## నేర నియంత్రణే లక్ష్యం

### నిఘా నేత్రాలతో నిరంతర పర్యవేక్షణ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 7)

పట్టణ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్ఐ రాజేష్ వినూత్న చర్యలు చేపడుతున్నారు. పట్టణాన్ని నేరరహితంగా మార్చేందుకు సాంకేతికతను జోడించి నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఈ పాటికే ఏర్పాటు చేశారు. ఏరా ్పటు చేసిన కెమెరాలను పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు స్వయంగా ఎస్ఐ రాజేష్ పర్యవేక్షిస్తున్నారు. నిఘా నీడలో ప్రతి కదలిక రికార్డ్ అవుతుంది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరిస్తున్నారు. చైన్ స్నాచింగ్, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ నిఘా వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. వాహనాల రద్దీని, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనను కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ తగిన చర్యలు చేపడతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మందుబాబులకు జరిమానా




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 24 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టుకు హాజరుపరిచిన వారిలో 23 మందికి ఒక్కరికి రూ.10వేలు చొప్పున రూ.2,30,000లు జరిమానా, ఒకరికి 2 రోజులు జైలు శిక్ష విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరు ఎంవీ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 7)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవిఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ మరియు హెల్త్ క్లబ్




కోఆర్డినేటర్ డాక్టర్ బి సుజాత ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుజాత మాట్లాడుతూ ఆరోగ్యం ఒక వ్యక్తిగత విషయం మాత్రమే కాదు అది సమాజ స్థిరత్వానికి, ఆర్థిక అభివృద్ధి కి, మానవ భద్రతకు పునాది ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 2026 వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించిన టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ అనే థీమ్ తో ప్రపంచానికి ఒక స్పష్టమైన దిశను సూచిస్తుంది. ఆరోగ్యానికి కాపాడాలంటే శాస్త్రాన్ని నమ్మరు ఆధారిత నిర్ణయాలను తీసుకోవడం అత్యవసరమ ను ఈ సందేశం స్పష్టం చేస్తోంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించబడే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఆరోగ్య సమస్యలపై ప్రపంచ దృష్టిని కేంద్రీకరించి ఒకే ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుంది. అది ఆరోగ్యం కేవలం వ్యాధులు ఏమి మాత్రమే కాకుండా శారీరక మానసిక సామాజిక శ్రేయస్సు కలయికని గుర్తు చేస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రిలియంట్ కంప్యూటర్స్ 31వ వార్షికోత్సవ వేడుకలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)

అంజయ్య రోడ్‌లో గల బ్రిలియంట్ కంప్యూటర్స్ సంస్థ ప్రధాన కార్యలయంలో ఘనంగా 31వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ న్యామతుల్లా బాషా, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూరలు భారీ కేక్ కట్ చేసి సిబ్బంది, విద్యార్థులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలో డాక్టర్ న్యాయతుల్లా బాషా మాట్లాడుతూ సాంకేతిక విద్యతో అత్యంత ఉపయోగ కరమైన కోర్సులను ప్రకాశం జిల్లాకు అందించడంలో సంస్థ ఎప్పుడు ముందుంటుందన్నారు. నేటి ప్రపంచాన్ని శాశిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషిన్ లేర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ డెవలపింగ్, సైబర్ సెక్యూటిటీస్ మొదలగు కోర్సు లను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. కంప్యూటర్ శిక్షణ తో పాటు ఉన్నత సాఫ్ట్ వేర్ సంస్థలు అయిన (మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, ఏఎస్ డబ్ల్యూ) లాంటి మరెన్నో సంస్థల నుంచి ఆథరైజేషన్ పొంది సర్టిఫికేషన్నును అందిస్తున్న ఏకైక సంస్థ అన్నారు. దీంతో పాటు ఫారన్ ఎడ్యుకేషన్, సాఫ్ట్వేర్ డెవలప్ మెంట్, వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్లను ప్రకాశం జిల్లా వాసులకు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వంద మంది పేద విద్యార్థులకు జాబ్ ఓరియంటెడ్ కోర్సులు పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 10వ తేది లోపు సంస్థ ప్రధాన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో సంస్థ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## మావిగన్ ప్రశంసనీయం అసోసియేట్ ప్రొఫెసర్ పి వి అనిల్ కుమార్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 7)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి దృష్ట్యా రాజధాని ప్రాంతాన్ని మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు (మావిగన్) ప్రాంతాల మధ్య అభివృద్ధి చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించిన అంశం ప్రశంసనీయమైనదని కిట్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ పి వి అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మూడు ప్రధాన నగరాలు భౌగోళికంగా సమతుల్యంగా ఉండటంతో పాటు రవాణా, వాణిజ్య, విద్యా, వైద్య సదుపాయాలలో ముందంజలో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని రాజధానిగా అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ అవకాశాల పెరుగుదల వంటి అనేక అంశాల్లో ఇది కీలకంగా మారుతుందని తెలిపారు. కాబట్టి మావిగన్ ప్రాంతాన్ని రాజధానిగా అభివృద్ధి చేయాలనే ఆలోచన రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా సమర్థనీయమైనదిగా భావిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎస్ఎస్ఎన్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 7)

ముంగమూరు రోడ్‌లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరిగినట్లు కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ వై సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో జీవన శైలిలో వచ్చిన మార్పులవల్ల మధుమేహం,రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి కాబట్టి విద్యార్థులు ఆరోగ్య కరమైన జీవన శైలిని అలవర్చుకోవడం అత్యవసరమని, శుభ్రమైన పరిసరాలు, పోషకాహారం, నియమిత వ్యాయామం, సరిపడ నిద్ర, ఆరోగ్యాన్ని కాపాడేందుకు కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, సుసంపన్నమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ బండారి అనుశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి అనుగుణంగా ప్రతి వ్యక్తి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమని, మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి పునాది అని అన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలకు పని ఒత్తిడి, పోషకాహార లోపం, జీవన శైలి లో మార్పుల వంటి కారణాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, యువతీ, యువకులు తమ ఆరోగ్యం పై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు టి రాజేంద్రబాబు, టి నీలిమ, బి శ్యామల, వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com